సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం : 7 : ఏప్రిల్ : 2024



రికార్డు స్థాయిలో నిమ్మ ధర

నిమ్మ ధర రికార్డు స్థాయికి చేరింది. మార్కెట్‌లో కిలో ఏకంగా రూ.75 చేరడంతో నిమ్మ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

IIలో ▸



ఆగని వలంటీర్ల రాజీనామాలు

చంద్రబాబు దుష్ట పన్నాగానికి వ్యతిరేకంగా వలంటీర్ల రాజీనామాల కొనసాగుతోంది. శనివారం ఉమ్మడి పశ్చిమలో పలువురు రాజీనామా చేశారు.

IIలో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహరి సోమవారం (ఉదయం)
భీమవరం	6.24	4.33
ఏలూరు	6.27	4.31

న్యూస్‌రీల్

దెందులూరులో టీడీపీకి షాక్

రాజీనామా చేసిన చలుమోలు అశోక్‌గౌడ్



రాజీనామా పత్రాన్ని చూపుతున్న అశోక్‌గౌడ్

పెదవేగి: దెందులూరు నియోజకవర్గంలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. ప్రముఖ బీసీ నేత, బీసీ సాధికారత రాష్ట్ర కన్వీనర్ చలుమోలు అశోక్ గౌడ్ శనివారం టీడీపీకి రాజీనామా చేశారు. ఆ పార్టీలో అవమానాలు, వేధింపులు తట్టుకోలేక పార్టీకి రాజీనామా చేసినట్లు అశోక్ గౌడ్ తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు అంటే ఆత్మాభిమానం కలిగిన వర్గాలే తప్ప పల్లకీలు మోసే బోయలు కాదని అశోక్ గౌడ్ అన్నారు. దెందులూరులో చింతమనేనికి తప్ప ఇంకెవరికి సీటిచ్చినా గెలిపించుకుంటామని నేరుగా చంద్రబాబునాయుడికి వివరించి చెప్పినా పట్టించుకోకపోవడం బాధ కలిగించిందని, చింతమనేని దాడులు, దుర్భాషలు భరించలేకే పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు.

సాధనతో లక్ష్య ఛేదన



నిట్‌లో ఆకట్టుకున్న సాంస్కృతిక శోభ

తాడేపల్లిగూడెం: సాధనతో లక్ష్యాలను ఛేదించవచ్చని ఏపీ నిట్ డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య అన్నారు. శనివారం నిట్‌లో జరిగిన క్రీడా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మనసు పెట్టి సాధన చేస్తే ఆటలైనా, పాటలైనా, కళలైనా సులభంగా చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలన్నారు. ఆరోగ్యంతో పాటు మేధోశక్తిని పెంపొందించడానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. నూతన విద్యావిధానంలో పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని, , వైవిధ్యభరితమైన ఆలోచనలతో ముందుకొచ్చే విద్యార్థులను నిట్ ఎప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. డీన్‌లు వీరేష్‌కుమార్, కార్తీక్ శేషాద్రి మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఖ్యాతి గడించడమే కాకుండా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు.

భగవద్గీత పోటీలు ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా స్థాయి భగవద్గీత శ్లోక పఠన పోటీలను ఉద్దరాజు అనందరాజు ఫౌండేషన్ అధ్వర్యంలో భీమవరం ఆనంద్ ఫంక్షన్ హాల్లో శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు జరిగే పోటీలను ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు ప్రారంభించి మాట్లాడారు. ఆనంద అష్టోత్తర శత భగవద్గీతలోని 108 శ్లోకాల పోటీలను 3 విభాగాల్లో నిర్వహిస్తున్నామని, మొదటి విభాగం సబ్ జూనియర్స్ (5 నుంచి 10 ఏళ్లు) 11 నుంచి 20 శ్లోకాలు, రెండో విభాగం జూనియర్స్ (11 నుంచి 18 ఏళ్లు) 31 నుంచి 50 శ్లోకాలు, మూడో విభాగం సీనియర్స్ (19 ఏళ్లు పైన) 51 నుంచి 75 శ్లోకాలపై పోటీలను నిర్వహిస్తున్నామని, ఈ పోటీలలో సుమారు 600 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, విజేతలకు 13న బహుమతులు అందిస్తామని తెలిపారు.

క్యూ కాంప్లెక్స్‌లోకి పాము



వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో తాచుపాము

ద్వారకాతిరుమల: శ్రీవారి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి శనివారం ఒక తాచుపాము ప్రవేశించింది. అకస్మాత్తుగా వచ్చిన పామును చూసి అక్కడ ఉన్న భక్తులంతా ఒక్కసారిగా భయాందోళనలతో కేకలు వేసి, పరుగులు తీశారు. వెంటనే అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది క్యూకాంప్లెక్స్‌లోకి వచ్చి చూసేసరికి పాము నెమ్మదిగా పక్కనే ఉన్న చెట్లలోకి వెళ్లిపోయింది. దాంతో భక్తులంతా ఊపిరిపీల్చుకున్నారు.

జేఈఈ మెయిన్స్‌కు 487 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిట్, ట్రిబుల్ ఐటీ కళాశాలల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) మెయిన్ రెండో విడత పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. 3వ రోజు పరీక్షకు 530 మందికి 487 మంది హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 180 మందికి 171 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 85 మందికి 81 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 162 హాజరు కాగా, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 85 మందికి 73 మంది హాజరయ్యారు.

కూటమికి బీటలు

- ఉమ్మడి పశ్చిమలో టీడీపీ, జనసేన, బీజేపీ తలోదారి
- ఉండిలో రామరాజుకు హ్యాండిచ్చిన బాబు
- రఘురామకృష్ణరాజుకు సీటు అనడంతో భగ్గుమన్న కేడర్
- దెందులూరులో టీడీపీ నేత అశోక్‌గౌడ్ రాజీనామా
- స్వతంత్రంగా బరిలో దిగేందుకు తపన చౌదరి సన్నాహాలు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రతిపక్ష కూటమి బీటలు వారుతోంది. నేతలు తలోదారి అన్నట్లుగా ఉండడంతో గెలుపు అవకాశాలు రోజురోజుకు సన్నగిల్లుతున్నాయి. ఇంతలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జిల్లా పర్యటన మరింత చిచ్చు రాజేసింది. ఏలూరు ఎంపీ సీటు విషయంలో వెనక్కి తగ్గేది లేదంటూ బీజేపీ నేత తపన చౌదరి హడావుడి చేస్తుండగా.. ఉండిలో సిట్టింగ్ ఎమ్మెల్యేకు చంద్రబాబు షాక్ ఇవ్వడంతో టీడీపీ శ్రేణులు ఉలిక్కిపడ్డాయి. కూటమిలో కీలక నేతలుగా ఉన్నవారు రాజీనామాల బాట పట్టి అధికార వైఎస్సార్‌సీపీలో చేరుతుండటంతో కూటమి రాజకీయాల్లో తీవ్ర గందరగోళం రేగింది.

ఉండిలో రామరాజుకు షాక్

పశ్చిమగోదావరి జిల్లాలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు శుక్రవారం నర్సాపురం, పాలకొల్లులో పర్యటించి రఘురామకృష్ణరాజును టీడీపీలో చేర్చుకున్నారు. శనివారం ఉదయం పాలకొల్లులో పశ్చిమగోదావరి జిల్లా అసెంబ్లీ అభ్యర్థులతో పాటు, మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఉండి సీటును రఘురామకృష్ణరాజుకు ఖరారు చేసి రామరాజుకు హ్యాండ్ ఇచ్చినట్లు సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజును తొలి జాబితాలో అభ్యర్థిగా ఖరారు చేయగా రామరాజు, ఆయన సతీమణి ఇద్దరూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. రఘురామరాజుకు సీటు అనడంతో టీడీపీ కేడర్ పాలకొల్లులో చంద్రబాబు క్యాంపు వద్దకు చేరుకుని పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసింది. చంద్రబాబు కాన్వాయ్‌ని అడ్డగించి ఘెరావ్ చేశారు. రామరాజుకే సీటు ఇవ్వాలని, రఘురామకృష్ణరాజుకు ఇస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని నినాదాలు చేశారు. దీంతో నియోజకవర్గమంతా టిక్కెట్ మార్పు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. రామరాజు వర్గానికి సర్ది చెప్పే ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో పశ్చిమ టీడీపీ కూటమి రాజకీయాల్లో గందరగోళం నెలకొంది. ఇంతవరకు ఎక్కడా లేని విధంగా జనసేనకు కేటాయించిన నర్సాపురం అసెంబ్లీ సీటులో చంద్రబాబునాయుడు సభ నిర్వహించడంపై పార్టీలో తీవ్ర చర్చ సాగుతోంది.

ఏలూరు పార్లమెంట్‌లో వరుస షాక్‌లు

ఏలూరు పార్లమెంట్‌లో కూటమి పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. దెందులూరు నియోజకవర్గ టీడీపీ సీటు ఆశించి భంగపడిన అశోక్‌గౌడ్ పార్టీకి రాజీనామా చేశారు. ఆయన వైఎస్సార్‌సీపీలో చేరనున్నారు. దెందులూరు నియోజకవర్గంలో అశోక్‌గౌడ్‌కు బలమైన సామాజిక వర్గం మద్దతు ఉండటంతో పాటు టీడీపీలో క్రియాశీలకంగా పనిచేశారు.

తపన చౌదరి బల ప్రదర్శన

ఏలూరు పార్లమెంట్ బీజేపీ నేత తపన చౌదరి బల ప్రదర్శనకు దిగారు. పోలవరం నుంచి కైకలూరు వరకు భారీ కార్ల ర్యాలీ నిర్వహించారు. ఏలూరు పార్లమెంట్ నుంచి పోటీకి వెనక్కి తగ్గేది లేదని టీడీపీ కుట్ర రాజకీయాలకు బీజేపీని బలి చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. ఈ క్రమంలో పార్లమెంట్ నుంచి పోటీ తప్పనిసరిగా చేస్తానని, అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తానని కేడర్‌కు సంకేతాలు ఇచ్చారు.

పేదల పాలిట పెన్నిధి జగన్



తణుకులో 'చంద్రబాబు ద్రోహి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ముద్రగడ, మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, ఎంపీ అభ్యర్థులు ఉమాబాల, సునీల్‌కుమార్ తదితరులు

- మంత్రి కారుమూరి అందరివాడు
- తణుకులో కాపుల ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి ముద్రగడ

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పాలిట పెన్నిధి అని, ఆయన పరిపాలనను చూసే వైఎస్సార్‌సీపీలో చేరానని మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం అన్నారు. తణుకు కాపు కల్యాణ మండలంలో శనివారం నిర్వహించిన కాపు వర్గీయుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను పదవులు ఆశించి పార్టీలోకి రాలేదని మంచి పరిపాలన అందిస్తున్న జగన్‌వైపు నిలబడాలనే వచ్చానని, ఏదైనా గౌరవం ఇస్తే తీసుకుంటానే కానీ అడగబోనని చెప్పారు. కాపులకు మంచి చేసిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. అందరివాడుగా పేరున్న మంత్రి కారుమూరి కడుపు చూసే వ్యక్తి అని ఆయనకు అండగా నిలబడితే మంచి చేస్తారని అన్నారు.

జగన్‌వైపు నిలిచిన మహావ్యక్తి ముద్రగడ

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక పాలనకు అండగా నిలిచిన మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం జీవితం ఎంతో నీతివంతమైందని, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. కాపుల కారణంగానే తాను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నానని, అత్తిలికి చెందిన మద్దాల నాగేశ్వరరావు చేయూతతోనే తన రాజకీయ జీవితం మొదలైందని అన్నారు. రాష్ట్రంలో అందరి మేలు కోరుకునే ఒకే ఒక్క వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. అలాంటి నేతకు కాపులంతా అండగా నిలబడి మరొక్కసారి సీఎంగా చేసుకునేందుకు కృషిచేయాలని అన్నారు.

కాపుల కోసం నిలబడ్డ నేత ముద్రగడ

కాపు జాతి కోసం ప్రాణాలు కూడా ఫణంగా పెట్టి ఉద్యమాన్ని నడిపిన వ్యక్తి ముద్రగడ పద్మనాభం అని నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. మాజీ మంత్రి ముద్రగడ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. కాపుల ఆరాధ్యదైవం వంగవీటి మోహనరంగాను అత్యంత దారుణంగా చంపించిన చంద్రబాబు కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంతోపాటు ఆయన కుటుంబాన్ని తీవ్రంగా ఇబ్బంది పెట్టిందని కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చినిమిల్లి వెంకటరాయుడు అన్నారు. అనంతరం చంద్రబాబు దోషి అనే పుస్తకాన్ని సభలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌టీఐ మాజీ అధ్యక్షులు పి.విజయబాబు, రామానుజం, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణిప్రసాద్, ఎంపీపీ ఆర్.ధనరాజు, మంగెన సూర్య, పైబోయిన సత్యనారాయణ, యిండుగపల్లి బలరామకృష్ణ, మారిశెట్టి శివశంకర్, మారిశెట్టి శేషగిరి, నూకల కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత కొనసాగించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఈవీఎంల ర్యాండమైజేషన్ కోసం పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ ఏడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఈవీఎంల రేషనలైజేషన్ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గొడౌన్ల వద్ద పటిష్ట బందోబస్తు నిత్యం కొనసాగాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 12 నుంచి ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ జరుగుతుందని, అనంతరం వివిధ అసెంబ్లీ నియోజవర్గాలకు ఈవీయంలు కేటాయిస్తారన్నారు. ఈ విషయమై రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందుగానే సమాచారాన్ని అందజేసి రాండమైజేషన్ ప్రక్రియకు హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య, రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, యం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి ఓర్వలేకపోతున్నారు

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



అప్పారావుపేటలో బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలకు న్యాయం జరిగితే చంద్రబాబు, పవన్ కల్యాణ్ చూడలేకపోతున్నారని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని అప్పారావుపేటలో బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వలంటీర్లు పింఛన్లు ఇవ్వడాన్ని చూడలేక కోర్టులో కేసు వేసి అడ్డుకున్నారన్నారు. దీంతో రాష్ట్రంలో 31 మంది పింఛన్ల కోసం వెళ్తూ మృతి చెందారన్నారు. తాడేపల్లిగూడెం మండలం పడాలలోనూ ఇలానే పింఛన్ కోసం వెళుతూ వృద్ధుడు సొమ్మసిల్లిపోయాడని గుర్తు చేశారు. చంద్రబాబు, ఆ పార్టీ నేతల అబద్ధాలు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచిస్తున్నారని, దీనికి సిగ్గుపడాలన్నారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచేశారన్నారు. ఇప్పుడు ఎవరైనా లంచం అడిగారా? అని ప్రశ్నించారు. జగన్ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నారన్నారు. ప్రజలకు సంబంధించిన ప్రతి విషయంలో సీఎం జగన్ శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీలు కట్టా రంగబాబు, సూర్పని రామకృష్ణ, సర్పంచ్ ఎలిపే గాంధీ, ఉప సర్పంచ్ పాతపాటి రాఘవేంద్ర, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకృష్ణకుమారి, నాయకులు కారింకి వీర్రాజు, సొసైటీ చైర్మన్లు చిక్కాల సత్యనారాయణ, గుమ్మళ్ల తాతారావు, వెలిశెట్టి నరేంద్రకుమార్, తమ్మిశెట్టి చుక్కయ్య, గుండుమోగుల బలుసుల రావు, వీర్ల గోవింద్, కొలుకులూరి ధర్మరాజు, అడపా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కోసం జగన్‌కు పట్టంకట్టాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



యనమదుర్రులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: గత 58 నెలల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు వెన్నుదన్నుగా నిలిచారని మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని యనమదుర్రు, తోకతిప్ప, లోసరి గ్రామాలలో శనివారం నాయకులు, కార్యకర్తల సమావేశంలో గ్రంధి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ఖజానాలో చంద్రబాబు రూ. 100 కోట్లు మాత్రమే ఉంచారని రెండేళ్లు కరోనా విళయ తాండవం చేసినా సీఎం రాజకీయ చతురతతో కరువు కాటకాలు రాకుండా సంక్షేమ పథకాలు అందిస్తూ మరోవైపు రైతులకు గిట్టుబాటు ధరకల్పించారన్నారు. జనసేన అభ్యర్థి అంజిబాబు కష్టాలలో ఉన్న ప్రజలను కలుసుకునేందుకు కూడా ఇష్ట పడలేదన్నారు. ఇప్పుడు ఓట్లు కోసం వస్తున్నారని కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారన్నారు. ఎన్నికలల్లో ఇచ్చిన హామీలను 99.5 శాతం అమలు చేసి 33 లక్షలకు పైగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. గ్రామాలలో సచివాలయాలు, ఆర్‌బీకే సెంటర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించి ప్రజా రంజక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజల అండ ఉందన్నారు. పట్టణంలో కలగా ఉన్న 100 పడకల ఆస్పత్రికోసం రూ. 16 కోట్లు విలువ చేసే 4 ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చానన్నారు. జిల్లా కేంద్రం భీమవరం కోసం అందివచ్చిన మంత్రి పదవినే వదులకున్నానన్నారు. తాడేరు వద్ద గునుపూడి సౌత్ డ్రైయిన్‌పై వంతెన నిర్మించామని, యనమదుర్రు డ్రైయిన్‌పై నిరుపయోగంగా ఉన్న 3 వంతెనలకు అప్రోచ్‌ల నిమిత్తం నిదులు మంజూరు చేయించామన్నారు. గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు సుమారు రూ. 20 కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా పైపులైన్‌లు నిర్మిస్తున్నామన్నారు. నాడు నేడు ద్వారా సుమారు రూ. 21 కోట్లతో పాఠశాలలకు అభివృద్ధి చేశామన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సుమారు 15 వేల మంది ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, సర్పంచ్‌లు బూరబత్తులు రామ్మూర్తి, తిరుమాని శ్రీను, రామాని శివాజీ వర్మ, ఎంపీటీసీ బొమ్మిడి కొండరాజు, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేయాలి

ప్రధాన ఎన్నికల అధికారి ఎంకే మీనా

భీమవరం (ప్రకాశంచౌక్): త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లను త్వరతగతిన పూర్తి చేయాలని ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలపై ఉందని పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. సమీక్షలో కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింటు కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, ఎస్పీ అజిత వేజెండ్ల తదితరులు పాల్గొన్నారు. ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికల్లో హింసకు, రీపోలింగ్‌కు తావులేకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని, సరిహద్దుల్లో చెక్ పోస్టుల వద్ద నిఘా పెట్టాలని సూచించారు. రూ. 50వేలకు మించి నగదు కలిగివుంటే వెంటనే జప్తు చేయాలన్నారు. నగదు జప్తు కేసులను 24 గంటల్లోనే పరిష్కరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణం చర్యలు చేపట్టాలని జిల్లా స్థాయిలోనే సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుని తదుపరి మాత్రమే నివేదిక పంపాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పోలీసు తనిఖీల్లో రూ.41.63 లక్షలు సీజ్ చేసి 22 కేసులు నమోదు చేశామని, 2,322 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో 1463 పోలింగు కేంద్రాలు ఉన్నాయని వాటిలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 282 ఉన్నాయని వీటికి మ్యాపింగ్ కూడా పూర్తిచేశామని చెప్పారు.

అక్రమ మద్యంపై నిఘా ఉంచాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా అక్రమ మద్యం తరలింపు, పంపిణీపై గట్టి నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్, ఎస్పీ అజిత వేజెండ్లతో కలిసి సమీక్షించారు. ఈ ఎట్టి పరిస్థితుల్లో అక్రమ మద్యం రవాణా కాకూడదని ఇందుకు గట్టిగా నిఘాతో పనిచేయాలన్నారు. డిపోల నుంచి సొమ్ము చెల్లించకుండానే ఎక్కువ మొత్తంలో మద్యం బాటిల్స్ తీసుకెళుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. మద్యం అమ్మకాలు అనుమానాస్పదంగా పెరిగిన చోట సంబంధిత దుకాణాలపై పూర్తి నిఘ ఉంచాలన్నారు. జిల్లాల్లోని అన్ని ఎక్సైజ్ యూనిట్లు, డిస్టిలరీలు, బాట్లింగ్ యూనిట్లు, మద్యం గోదాములు సంబంధిత అధికారుల నిరంతర నిఘాలో ఉంచి క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అభ్యర్థులు కూపన్లు, టోకెన్ల పంపిణీని ఆశ్రయిస్తున్నారని, వాటిని మద్యం షాపులో మద్యం బాటిళ్లకు మార్చుకోవచ్చని ప్రచారం జరుగుతుందన్నారు. లోకల్ మద్యంపై దృష్టి సారించాలని, స్లమ్ ఏరియాలో, వాటికి సమీపంలో ఉన్న దుకాణాలను తరచూ తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య, ఏఎస్పీ వి.భీమారావు, సెబ్ ఏఎస్పీ ఎ.టి.వి.రవికుమార్, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, యం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, ఆచంట నియోజకవర్గ ఆర్వో వి.స్వామినాయుడు, పాలకొల్లు నియోజకవర్గ ఆర్వో బి.శివ నారాయణరెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం(ప్రకాశంచౌక్): లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింటు కలెక్టరు సి.వి. ప్రవీణ్ ఆదిత్య ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేటు వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లాలో కొత్తగా 5 స్కానింగు సెంటర్ల ఏర్పాటు, 9 సెంటర్ల రెన్యువల్, 8 సెంటర్లు ఆధునికీకరణకు మంజూరు, సంతానోత్పత్తి కేంద్రాలు, అల్ట్రా సౌండు కేంద్రాలపై సమీక్షించారు. సాధారణ ప్రసవాలు నూరు శాతం జరిగేలా చూడాలని, అన్ని డెలివరీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా చూడాలన్నారు. తప్పని పరిస్థితుల్లో మాత్రమే ఆపరేషన్‌కు మొగ్గు చూపాలన్నారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసే సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కానింగు సెంటరులో సంబంధిత దస్త్రాలను నిశితంగా పరిశీలించాలన్నారు. గర్భిణులకు స్కానింగు నిర్వహిస్తున్న కేంద్రాలలో పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.డి.మహేశ్వర రావు, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.భానునాయక్, డీసీహెచ్‌ఎస్ డా.పి.సూర్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ వాకపల్లి ప్రసాదు, రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ డా.రామభద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హ్యాకథాన్ జాతీయ పోటీల్లో 'ఎస్ఆర్కేఆర్' ప్రతిభ



ప్రథమస్థానం సాధించిన విజేతలకు బహుమతి అందిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్ పోటీలలో ఎస్ఆర్కేఆర్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి రూ.10 వేలు నగదు బహుమతి అందుకున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి బూట్ క్యాంప్, జాతీయస్థాయి హ్యాకథాన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎస్ఆర్కేఆర్ విద్యార్థులు ఇయర్ ఫోన్స్ రెండు గంటల దాటిన తర్వాత ఆటోమేటిక్‌గా పనిచేయడం ఆగిపోయే విధానాన్ని రూపొందించి ప్రథమ బహుమతిని గెల్చుకున్నారు. అదేవిధంగా ద్వితీయ బహుమతి ఎస్ఆర్కేఆర్, తృతీయ బహుమతిని సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, నాలుగో బహుమతి ఎస్ఆర్కేఆర్, ఐదో బహుమతి తాడేపల్లిగూడెం శశి ఇంజనీరింగ్ విద్యార్థులకు దక్కింది. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, కార్యక్రమం కో-ఆర్డినేటర్స్ ఐ.హేమలత, కె.కిషోర్‌రాజు, రామ్‌గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

చాట్రాయి: మర్లపాలెంలో తానంకి చంటి (56) శుక్రవారం పశువులను మేపడానికి వెళ్లి చెరువులో జారి పడి మృతి చెందాడు. శనివారం చెరువులో చెప్పులు తేలియాడటాన్ని చూసి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై స్వామి ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది చెరువులోకి దిగి మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేసవిలో వలసలకు చెక్

- ఉపాధి హామీ కూలీలకు మరింత భరోసా
- రోజువారీ వేతనం రూ.300లకు పెంపు
- జిల్లాలో 1.30 లక్షల కూలీలకు జాబ్‌కార్డులు
- పెరిగిన వేతనంతో రూ.34 కోట్ల అదనపు లబ్ధి



పాలకోడేరు మండలం వేంద్ర అగ్రహారంలో పంట బోదె అభివృద్ధి పనులు చేస్తున్న కూలీలు



ఆకివీడు మండలం చినమిల్లిపాడులో పంట కాలువలో గుర్రపుడెక్క తొలగిస్తున్న దృశ్యం

ఆకివీడు: పనులు లేక పస్తులుండే రోజులకు కాలం చెల్లింది. అలాగే పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే పనులు కల్పించడమే కాక కూలీలకు ఈ ఏడాది నుంచి రోజువారీ వేతనాన్ని పెంచడంతో ఉపాధి కూలీల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రోజు వేతనంగా రూ.272 అందజేయగా, ప్రస్తుతం 2024–25 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ వేతనాన్ని రూ.300లకు పెంచి స్థానికంగానే పనుల్ని కల్పిస్తోంది ప్రభుత్వం. వ్యవసాయ పనులు లేని రోజుల్లో కూలీలకు పని కల్పించే దిశగా ఉపాధి పనుల్ని గ్రామాల్లో కల్పిస్తున్నారు. కూలీలకు పనితో పాటు, రైతులకు ఉపయోగకరంగా ఉండే పంట బోదెలు, మురుగు కాల్వల అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మార్చి నుంచి జూన్ వరకు కూలీలకు ఉపాధికి భరోసా కల్పిస్తున్నారు. జూన్ నుంచి వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే సూచనలు కన్పిస్తుండటంతో కూలీలు వలస పనులకు చెక్‌పెట్టారు. పలు పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులు నిర్వహించేందుకు ఆయా పనుల్ని గుర్తించి, పంచాయతీల్లో తీర్మానం చేసిన తరువాత పనుల్ని ప్రారంభిస్తున్నారు. సొంత గ్రామాలు వదిలి పనుల కోసం రాష్ట్రాలు, జిల్లాలు దాటి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే కూలీలకు జాబ్ కార్డులు అందజేసి, ప్రభుత్వం పనులు కల్పిస్తోంది.

ఉపాధి పనులపై కూలీల్లో ఆసక్తి

జిల్లాలో జాబ్ కార్డుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. ఉపాధి పనులపై కూలీలు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది 1.30 లక్షల జాబ్ కార్డులతో వేసవిలో పంట కాల్వలు, మురుగు కాల్వల్లో తూడు, చెరుల్లో తూడు తొలగింపు పనులు చేపడుతున్నారు. రైతులకు ఇబ్బంది కలిగిస్తున్న పనులను సత్వరమే చేపట్టి పరిష్కరిస్తున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 42 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా 6,256 పనులను 45,95,354 పనిదినాల్ని పరిపాలనామోదం పొందారు. ఏప్రిల్‌లో 7,85,000 పనిదినాలు లక్ష్యంగా రోజువారీ 35 వేలు పనిదినాల్ని కల్పించాలని నిర్ణయించారు. ప్రస్తుతం రోజుకు 14,750 పనిదినాలు నమోదవుతున్నాయి. మే నెలలో చెరువులు, ఫీల్డ్ ఛానల్స్ ఆరబెట్టించి 14 లక్షల పనిదినాలు కల్పించనున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా హౌసింగ్, ప్లాంటేషన్, ఫీల్డ్, ఫీడర్ చానల్స్, చెరువుల పనులు జరుగుతున్నాయి.

ఉపాధి పనులతోనే ఇల్లు గడిచేది



ఉపాధి పనులతో ఇల్లు గడుస్తోంది. పని దినాలు కల్పించడంతో వ్యవసాయ పనులు లేని సమయంలో ఆదాయం లభిస్తుంది. ప్రభుత్వ ఉపాధి పనుల సంఖ్యను పెంచాలి.

– గురుదాసి బాల నాగమ్మ, చినమిల్లిపాడు, ఆకివీడు మండలం

పెరిగిన వేతనంతో ఆనందం



వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పథకం వల్ల పనులు దొరుకుతున్నాయి. నిత్యావసరాల కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు లేవు. వేతనం పెరగడం ఆనందంగా ఉంది.

– చాట్ల కామేశ్వరి, వేంద్ర అగ్రహారం, పాలకోడేరు మండలం

ఊళ్లోనే పనులు దొరుకుతున్నాయి



ఉపాధి పనులతో వలసలకు వెళ్లడం తప్పింది. గ్రామంలోనే పనులు చేసుకుని కుటుంబ సభ్యులతో జీవిస్తున్నాం. గతంలో పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లే దుస్థితి నుంచి ప్రభుత్వం రక్షించింది.

– ఘంటశాల సమురవేణి, వడ్డిగూడెం, ఆకివీడు మండలం

ఆర్థిక ఇబ్బందులు తగ్గుతాయి



ఉపాధి పనులతో ఆదాయం లభించి ఇల్లు గడుస్తోంది. ఆర్థిక ఇబ్బందులు తగ్గుతున్నాయి. ఉపాధి పనుల వల్ల పంట, మురుగు కాల్వలు అభివృద్ధి చెంది రైతులకు మేలు జరుగుతుంది.

– దొంగ కనకదుర్గ, వేంద్ర, పాలకోడేరు మండలం

దేవదాయ భూములు అన్యాక్రాంతం కానివ్వొద్దు



దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రతి ఈఓ కృషి చేయాలని దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యన్నారాయణ సూచించారు. స్థానిక మాధవ కల్యాణ మండప ఆవరణలో శనివారం కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు, కాకినాడ డివిజన్లోని 6(ఏ) (బి) (సి) (ఇ) ఆలయాల్లో, ధర్మసత్రంలలో పనిచేసే ఈఓలు, మేనేజర్లు, డివిజినల్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీర్లకు ఆయన దేవాలయ భూములు, ఇతర ఆస్తుల పరిరక్షణ, రీసర్వేపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో భూముల రీసర్వే, ఆడిట్, ఆదాయం, ఖర్చులు ఇతర అంశాలపై చర్చించారు. అధికారులు అలసత్వం వహించవద్దని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అధికారులు ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. దేవదాయశాఖ ఏడీసీ రామచంద్రమోహన్, జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ అజాద్, ఈఓ వేంద్ర త్రినాథరావు, డీసీ విజయరాజు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

టి.నరసాపురం: సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు శనివారం చెప్పారు. వెలగపాడు శివారులో సారా తయారు చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో శనివారం సిబ్బందితో దాడి చేసినట్లు చెప్పారు. దాడుల్లో 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం చింతలపూడి కోర్టుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

నాటు తుపాకీ స్వాధీనం

కైకలూరు: వదర్లపాడులో నాటు తుపాకీతో సంచరిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశామని రూరల్ ఎస్సై టి.రామకృష్ణ శనివారం చెప్పారు. గ్రామంలో చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్.లాలు (26) అనే వ్యక్తి నుంచి తుపాకీ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఆగని వలంటీర్ల రాజీనామాలు

పెనుగొండ: చంద్రబాబు దుష్ట పన్నాగానికి వ్యతిరేకంగా వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. శనివారం ఆచంట, పెనుగొండ మండలాల్లోని గ్రామాల్లో వలంటీర్లు తమ రాజీనామాల పత్రాలను అధికారులకు సమర్పించారు. ముఖ్యంగా పెనుగొండ, ఇలపర్రు, సిద్ధాంతం, దేవ, ములపర్రు గ్రామాల్లో రాజీనామా పత్రాలను సమర్పించి చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజుకు అండగా ఉంటామంటూ నినాదాలు చేశారు.



మంచిలిలో రాజీనామ చేసిన వలంటీర్లు

నారాయణపురంలో..

ఉంగుటూరు : నారాయణపురంలో 13 మంది వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. తామంతా స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావుకు అందజేశారు. సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శి ఎంపీడీఓకు వివరించారు.

మంచిలిలో..

అత్తిలి : మంచిలి గ్రామానికి చెందిన 23 మంది వలంటీర్లు శనివారం తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు సేవచేసే అవకాశాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కల్పించారని, అయితే ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు వలంటీర్లను ఉగ్రవాదులుగా పోల్చడాన్ని తట్టుకోలేక తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ సేవ చేస్తున్న వలంటీర్ల ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్రతిపక్షపార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని చేయడాన్ని తట్టుకోలేక వలంటీర్ కొలువులకు స్వచ్ఛందంగా రాజీనామా చేశామన్నారు.



నారాయణపురంలో రాజీనామా చేసిన వలంటీర్లు



సిద్ధాతం సచివాలయం -1లో రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

తనిఖీల్లో నగదు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీస్, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు



అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో వాహనాల తనిఖీలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలో శనివారం ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా కారులో వెళుతున్న ఓ వ్యక్తి నుంచి రూ.81,700 నగదు స్వాధీనం చేసుకున్నామని ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి వెంకటరమణ చెప్పారు. నగదుకు సంబంధించి ఎటువంటి పత్రాలను చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్న నగదును ట్రెజరీలో జమచేసినట్లు తెలిపారు. సీఐ రాజేష్ మాట్లాడుతూ రూ.50 వేల పైబడి నగదును ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తే స్వాధీనం చేసుకుంటామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. ఈ తనిఖీల్లో పీసీలు అబ్బులు, మంగరాజు పాల్గొన్నారు.

లింగగూడెంలో..

చింతలపూడి: చింతలపూడి మండలం లింగగూడెం చెక్‌పోస్ట్ వద్ద శనివారం తెల్లవారుజామున అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రూ.62,340 స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కారులో వెళుతున్న ఓ వ్యక్తి నుంచి రూ.93,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పీవీవీ గోపాలకృష్ణ చెప్పారు. పట్టుబడ్డ సొమ్ముకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో జిల్లా ట్రెజరీలో డిపాజిట్ చేసినట్లు తెలిపారు.

రికార్డు స్థాయిలో నిమ్మ ధర

- మార్కెట్‌లో కిలో రూ.75 చేరిన ధైనం
- రిటైల్‌లో కాయ రూ.5కు విక్రయం
- తగ్గిన దిగుబడి, పెరిగిన డిమాండ్





నిమ్మకాయలను కోస్తున్న కూలీలు

పెదవేగి: నిమ్మ ధర రికార్డు స్థాయికి చేరింది. మార్కెట్‌లో కిలో ఏకంగా రూ.75 పలుకుతోంది. లక్ష్మీపురం, ఏలూరు మార్కెట్ యార్డుల్లో శనివారం నిమ్మ ధరలు కిలో రూ.40లతో ప్రారంభమై రూ.60 వరకు చేరాయి. ఒక దశలో కిలో నిమ్మకాయలు రూ.75 మార్కును చేరుకుంది. దీంతో రైతులు ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. నిన్నామొన్నటివరకు నిమ్మకాయలకు సరైన గిట్టుబాటు ధర లేక అల్లాడుతుండగా ఒక్కసారిగా ధర భారీగా పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి తక్కువగా ఉండటం, వేసవికి తగ్గట్టుగా డిమాండ్ పెరగడంతో ధర పెరిగిందని రైతులు చెబుతున్నారు. ఈ ధర ఈనెలాఖరు వరకు ఇలాగే కొనసాగితే తమ కష్టాలు తీరిపోతాయని రైతులు ఆశతో ఉన్నారు. రిటైల్ మార్కెట్లో కాయ ఒక్కింటికి ఐదు రూపాయలకు విక్రయిస్తున్నారు.

ధర అనూహ్యంగా పెరిగింది



గతంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో సౌత్ నుంచి నార్త్‌కు 200 నుంచి 215 లారీల్లో నిమ్మ ఎగుమతి అయ్యేది. అలాంటిది ఇప్పుడు 35 లారీలకు ఎగుమతులు పడిపోయాయి. దీనికి తోడు దిగుబడి గణనీయంగా తగ్గడంతో సరుకు లేక ధర అనూహ్యంగా పెరిగింది. గత ఏడాది అకాల వర్షాలతో కాపురాక దిగుబడిపై ప్రభావం చూపింది. మార్కెట్లకు కాయల రాక తగ్గింది. ధర పెరగడానికి ఇది కూడా ఒక కారణం.

– తాతా మాణిక్యాలరావు, నిమ్మ రైతు, పెదవేగి

డిమాండ్‌కు తగ్గ దిగుబడి లేకే



గతంలో ఏలూరు మార్కెట్ నుంచి 20 లారీల సరకు ఎగుమతి అయ్యేది. కానీ ఇప్పుడు కేవలం ఆరు లారీల సరకు మాత్రమే ఎగుమతి అవుతోంది. ఇటీవల నిమ్మ వాడకం కూడా పెరిగింది. దిగుబడి తగ్గి డిమాండ్ పెరగడంతో ధర పెరిగింది. ధరలేనప్పుడు చెట్లను కొట్టివేయడం, ధర ఉన్నప్పుడు మొక్కలు నాటడం అనేది సరైన విధానం కాదు. సాగులో ఒడిదుడుకులు తట్టుకుని నిలబడితే లాభమే.

– మేకా లక్ష్మణరావు, దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్, లక్ష్మీపురం

మండుతున్న ఎండలు

- నిర్మానుష్యంగా రహదారులు
- అల్లాడిపోతున్న ప్రజలు



ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు లేక నిర్మానుష్యమైన దృశ్యం

పెంటపాడు: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ వేసవి తీవ్రత పెరుగుతోంది. గత వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7 గంటలకే భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఉదయం 10 గంటలకే రోడ్లపైకి రాకపోకలు తగ్గుతున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. అధికంగా ఎండ, ఉక్కపోత వల్ల ప్రజలు అల్లాడిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే మినహా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. నిర్మానుష్యంగా రహదారులు ఉంటున్నాయి. ఎండ తీవ్రతను తట్టుకోలేక 16వ నెంబర్ జాతీయరహదారిపై ప్రయాణించే వాహనదారులు ఎండ తీవ్రత సమయంలో రోడ్లకు ఇరువైపులా చెట్లకింద వాహనాలు నిలిపివేసి సేదదీరుతున్నారు. ఫలితంగా ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చేవారు ఎండ నుండి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు, ముఖానికి గుడ్డతో కప్పిన ముసుగులు వంటి రక్షణ సాధనాలను వినియోగిస్తున్నారు. ఎండ నుంచి రక్షణ పొందేందుకు వీలుగా శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా జ్యూస్‌సెంటర్లు, కొబ్బరిబొండాల వ్యాపారాలు జోరందుకున్నాయి. మరో పక్క వచ్చే నెలాఖరులో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ నెల ప్రారంభంలోనే ఎండలు ఇలా ఉంటే మే నెల ప్రారంభం నుంచి చివరి వరకు పరిస్థితి ఎంత భయాంకరంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకొంటే మేలు:

- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగును తీసుకెళ్లాలి.
- పలుచని తెలుపురంగు కాటన్ వస్త్రాలు ధరించాలి.
- తలకు టోపీ పెట్టుకోవాలి లేదా రుమాలు చుట్టుకోవాలి.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరుబయట అధికశ్రమతో కూడిన పనులు చేయరాదు.
- మజ్జిగ, నిమ్మరసం, మంచినీరుతో పాటు, ఓఆర్ఎస్ ద్రావణం, శీతల పానీయాలు వెంట తీసుకెళ్లాలి.
- వడదెబ్బ తగిలినవారికి వెంటనే వైద్యపరీక్షలు చేయించాలి.
- ఎక్కువగా నీరు, ద్రవపదార్థాలు సేవించాలి.
- ఎండలో పనిచేయాల్సి వచ్చినప్పుడు ప్రతి 20 నిముషాలకు ఒకసారి ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

వడగాడ్పులతో జాగ్రత్త



రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వడగాల్పులు వీస్తున్నాయి. మే నాటికి ఈ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఎండలలో పనిచేసేవారికి, తిరిగేవారికి వడదెబ్బ తగిలే ప్రమాదముంది. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. తడి క్లాత్‌తో శరీరమంతా తుడిచి, చల్లని గాలి తగిలే విధంగా చూడాలి. ఓవర్‌రి హైడ్రేషన్ (ఓఆర్ఎస్) ద్రావణం తాగించి, వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి. పీహెచ్‌సీల్లో అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

–డాక్టర్ పూజిత, ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారి, ముదునూరు పీహెచ్‌సీ

క్లుప్తంగా

ఆర్టీసీలో ప్రయాణం ఎంతో సురక్షితం



ప్రయాణికులకు బహుమతులు అందజేస్తున్న డిపో మేనేజర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ బస్సులలో ప్రయాణం ఎంతో సురక్షితమని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆర్టీసీ లక్కీ డిప్‌లో భాగంగా ప్రయాణీకులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసే కార్యక్రమం శనివారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగింది. జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లులో ఈ లక్కీడిప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేయాలన్నారు. ఈ నెల 21వ తేదీన తాడేపల్లిగూడెం డిపో నుంచి అరుణాచల యాత్రకు ప్రత్యేక బస్సు నడపనున్నట్లు తెలిపారు. ఈ బస్సులు శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, 23వ తేదీన పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ ఉంటుందని వెల్లడించారు. ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రయాణీకులకు, భక్తులకు విజ్ఞప్తి చేశారు.

వ్యాపారులకు, ఆర్య వైశ్యులకు చంద్రబాబు క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

తణుకు టౌన్: కిరాణా షాపుల్లో గంజాయి అమ్ముతున్నారంటూ చంద్రబాబు మాట్లాడిన తీరు దారుణమని తణుకు చాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్య వైశ్య సంఘం నాయకులు ఖండించారు. శనివారం సాయంత్రం తణుకులోని ఆర్యవైశ్య భవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో తణుకు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మాజేటి సూర్య ప్రకాశ్ మాట్లాడుతూ వ్యాపారుల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యానించిన చంద్రబాబు నాయుడు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో వ్యాపారులు ఎంతో సేవా దృక్పదంతో పని చేశారని, అలాంటి వారిపై అవమానకర వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. చంద్రబాబు బేషరతుగా వ్యాపారులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు మానేపల్లి శేఖర్, జల్లూరి జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్: పట్టణంలో మానవత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. తణుకు మానవత సంస్థ, బ్యాంక్ ఆఫ్ బరోడా తణుకు శాఖ ఆర్థిక సహాయంతో వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేసినట్లు మానవత సంస్థ అధ్యక్షుడు ఏ బాలాజీ తెలిపారు. శనివారం సాయంత్రం తణుకు రోటరీ క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో దివ్యాంగులైన ఆళ్ల సీతారామయ్య, జొన్నాడ కళావతిలకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఈ సైకిళ్లకు ఆర్థిక సహాయం అందజేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, మల్లిన అరుణ సారది, రామకృష్ణ, కాశీ విశ్వనాథ్, ఆలపాటి సోమేశ్వరరావు, ఆనందం మస్తాన్ రావు, కే సత్యనారాయణ, వీవీ హనుమంతరావు, సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ప్రాంతానికి వెళ్లి



దొంతవరంలో పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లికి చెందిన యాళ్ళ కుమారి ఆపరేషన్ చేయించుకుని తన కుమార్తె వద్ద ఉంగుటూరు మండలం దొంతవరంలో ఉంటుంది. ఆమెకు చినతాడేపల్లి గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కాటూరి డేనియల్ అక్కడికి వెళ్లి శనివారం వితంతు పింఛన్ సొమ్మును అందజేశారు.

ఓటరు స్లిప్పులు బీఎల్ఓలు పంపిణీ చేయాలి

పెనుమంట్ర: ప్రతి గ్రామంలో ఓటర్లకు స్లిప్పులను బీఎల్ఓలు పంపిణీ చేయాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి వి.స్వామినాయుడు అన్నా రు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, బూత్ లెవల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 14లోపుగా తమ ఓటు హక్కు కోసం ఫారం 6 ను దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గంగమ్మను దర్శించుకున్న మంత్రి కొట్టు



గంగాదేవి, జాలారి గంగమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: గంగమ్మ తల్లి చల్లని చూపు ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని అప్పారావుపేట గ్రామంలో వేంచేసియున్న గంగాదేవి, జాలారి గంగ, దండు మారెమ్మవార్లను ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవార్ల ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు కలగాలన్నారు. అలాగే ఆలయం వద్ద జరిగిన అన్నసమారాధనలో స్వయంగా భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో అడపా హరిబాబు, మాదేపల్లి నాగరాజు, మాదేపల్లి సూర్యనారాయణ, సోమలంక చినవెంకటరత్నం, మేకా సుబ్రహ్మణ్యం, ఎస్‌కే. సాహెబ్ షా, పెరుమాళ్ళ చిరంజీవి, పాతపాటి సత్తిరాజు, అడపా విష్ణు, అడపా ఎరుకయ్య, నార్నిరెడ్డి సూర్యనారాయణ, రాపాక వెంకటేశ్వరరావు, చిరంజీవి, నడిపల్లి నెల బాలుడు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు పట్టం కట్టాలి



గూడెం రెండో వార్డులో ప్రచారం చేస్తున్న ఉపముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు

పెంటపాడు: గత ఐదేళ్లు రాష్ట్రంలో పారదర్శక పాలన అందించిన ముఖ్యమంత్రి జగనన్నకు, ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణ సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించుకోవాలి ఉపముఖ్యమంత్రి తనయుడు, కుమార్తె బాల రాజేష్, కాంచన్‌లు విజ్ఞప్తి చేశారు. శనివారం గూడెంలోని 2వ వార్డులో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణను గెలిపించుకోవాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణను గెలిపించాలని కోరారు. గూడెం పట్టణంలోని వీకర్సుకాలనీ లో మహిళలు అత్యధికంగా కొట్టు సత్యనారాయణ తమకు ఎమ్మెల్యేగా ఉండాలని కోరుకొంటున్నారన్నారు. గాయత్రి గుడివద్ద నుంచి ప్రచారం ప్రారంభించి ప్రతి ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని కాంచన్ పార్టీ జెండాలతో ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు, పత్సమట్ల సావిత్రి, తెన్నేటి జగజ్జీవన్, బోణం విజయనిర్మల, దింటకుర్తి లీలావతి, బోళం రామలక్ష్మి, బెందుకూరి రాజేష్, వాలి సత్యనారాయణ, తాడిపత్రి రజని, తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు పాతూరులో పుట్టింటి పాన్పు



బలుసులమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగాది మహోత్సవాలు సందర్భంగా బలుసులమ్మ అమ్మవారికి ఆలయంలో శనివారం ఉదయం ఆలయ అర్చకులు ప్రదీప్‌శర్మ, గోపినాథ్‌శర్మ, మల్లిఖార్జున శర్మలచే మంగళ వాయిద్యాలతో విశేష పూజలు, గణపతి పూజ, గోపూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి గరగల సంప్రోక్షణ స్థానిక పెద్ద శివాలయం కాలువ వద్ద నిర్వహించారు. అనంతరం ఆలయ రజక ఆసాదులు ఆధ్వర్యంలో అమ్మవారి గరగలను, పోతురాజు ఘటాన్ని ధరించి, తీన్‌మార్ డప్పులతో, మేళా తాళాలతో, గరగ నృత్యాలతో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం పాతూరు పరిసర ప్రాంతాలలో వైభవంగా నిర్వహించారు. పాతూరు పుట్టింటి చిన్న బలుసులమ్మ ఆలయం సమీపంలో పాశం కాశీ విశ్వేశ్వరరావు–తులసి విజయలక్ష్మి దంపతులు ఇంటి వద్ద పుట్టింటి పాన్పు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి సంప్రదాయ రీతిలో విశేష పూజలు వైభవంగా జరిగాయి. స్థానికులు పెద్ద సంఖ్యలో హజరై అమ్మవారిని దర్శించారు. అనంతరం బలుసులమ్మ ఆలయం వద్ద పూజలు చేశారు.

వైఎస్సార్ సీపీ పాలనలో అందరికీ మేలు

గ్రామాల్లో జోరుగా వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం



వేల్పూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు టౌన్: అందరికీ న్యాయం చేశాం ఆదరించండి అంటూ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నేతలు ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. త్వరలో జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కోరుతూ తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. వేల్పూరు గ్రామంలో గత మూడు రోజులుగా గ్రామ వైఎస్సార్ సీపీ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి జరగబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమా బాలను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించుకోవాలన్నారు. గ్రామంలోని వివిధ వీధుల్లో ఇంటింటికి తిరి ఓట్లను అభ్యర్థించారు. వైస్ ఎంపీపీ ఐళెట్టి శేషుకుమారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, ఎంపీటీసీలు చుండ్రు శ్యామల, విజయ దుర్గ, తాడిపర్తి సుజాత, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారతీయ విద్యా విధానం అత్యుత్తమం

తణుకు టౌన్: భారతీయ విద్యా విధానం ప్రపంచంలోనే అత్యుత్తమైనందని ఢిల్లీకి చెందిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ హిమాన్షు ప్రసాద్ రాయ్ చెప్పారు. శనివారం తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేదాల నుంచి ఆర్టిఫీషియల్ వరకూ ఇండియన్ నాలెడ్జి పేరుతో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యా వ్యవస్థలో మేజర్, మైనర్ విద్యా విధానం అమల్లోకి వచ్చిందని ప్రసాద్‌రాయ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరో అతిథి డాక్టర్ విష్ణు ప్రకాశ్ మాట్లాడుతూ ఎడెక్స్ కోర్సులపై అవగాహన కల్పించారు.

భక్తి శ్రద్ధలకు ప్రతీక రంజాన్ మాసం



చిన్న మసీద్‌లో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): దైవం పట్ల భక్తి శ్రద్ధలకు ప్రతీక పవిత్ర రంజాన్ మాసం అని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక మస్జిద్ మహమ్మదీయ ఖురేషి (చిన్న మసీద్)లో శనివారం సాయంత్రం ఆయన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లిం సోదరులతో కలిసి పంక్తిలో కూర్చుని ఇఫ్తార్ విందును స్వీకరించారు. అనంతరం నమాజ్ ప్రార్థనలో సాంప్రదాయబద్ధంగా అత్యంత్త భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసమని, నెలంతా వీరు చేసే ఉపవాస దీక్షలు అసాధారణమని అన్నారు. తనకు చిన్ననాటి నుంచి ముస్లింలతో మంచి సాన్నిహిత్యం ఉందన్నారు. ఏటా రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు షఫీ ఉర్ రహమాన్, సెక్రటరీ జహీర్ రెహమాన్, ఉపాధ్యక్షుడు ఖలీల్ రెహమాన్, తాజుద్దీన్ బాబా, షేక్ అహ్మద్ తదితర ముస్లిం పెద్దలు, యువకులు, పిల్లలతో పాటు మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, న్యాయవాది శిరిగినీడి విజయకృష్ణ, దృశ్యకళల కార్పోరేషన్ స్టేట్ డైరక్టర్ మానికొండ వెంకటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్రప్రసాద్, చామన సూర్య చంద్రరావు, పలు వార్డుల ఇంచార్జ్‌లు, తదితరులు పాల్గొన్నారు.